I

సాక్షి
వికారాబాద్

బుధవారం । 5 । జూన్ । 2024



సేంద్రియ సాగుకే మొగ్గు

రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే ముప్పును గుర్తించిన రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించారు. IIలో▸



తునికాకు బోనస్‌పై..

తునికాకు సేకరణకు సంబంధించిన బోనస్ డబ్బు పక్కదారి పట్టిన విషయంపై అటవీ శాఖ విచారణ చేపట్టింది. IIలో▸



ఆర్టీసీ బస్సు బోల్తా

ఆర్టీసీ డ్రైవర్ బైక్‌ను తప్పించే క్రమంలో రోడ్డు పక్కన కల్వర్టుపై నుంచి కిందపడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. IIలో▸

మొత్తం ఓట్లు 29,38,370		పోలైనవి 16,57,107	
అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు	శాతం
కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	బీజేపీ	8,09,882	48.34
గడ్డం రంజిత్‌రెడ్డి	కాంగ్రెస్	6,36,985	38.02
కాసాని జ్ఞానేశ్వర్	బీఆర్‌ఎస్	1,78,968	10.68

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మెజార్టీ

1,72,897

ప్రజలకు సేవ చేసే అదృష్టం

చేవెళ్ల ప్రజలు ఎంతో తెలివైన వారు.. దేశానికి సేవ చేసే నాయకులు ఉండాలనే బీజేపీని గెలిపించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తా. నన్ను ఆశీర్వదించి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు. ఈ ప్రాంతంలో బీజేపీ ఎమ్మెల్యేలు లేకున్నా, స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోయినా దేశానికి సేవ చేసే మోదీయే, బీజేపీనే ఉండాలనే ఆలోచనతో మా పార్టీని గెలిపించారు. గతంలో ఎంపీగా, ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలకు ఎలా సేవ చేశానో అలాగే ఎంపీగా మరోసారి ప్రజలకు సేవ చేసే అదృష్టం దక్కింది. లోక్‌సభలో చేవెళ్ల ప్రాంత సమస్యలను ప్రస్తావించి అభివృద్ధికి కృషి చేస్తా.



ప్రొఫైల్

భార్య: సంగీతారెడ్డి, కొడుకు అనిందిత్‌రెడ్డి

తల్లిదండ్రులు: జస్టిస్ కొండా మాధవరెడ్డి, జయలతారెడ్డి

స్వస్థలం: ధర్మసాగర్, చేవెళ్ల మండలం

విద్యార్హత: ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్

రాజకీయ ప్రస్థానం: 2014లో టీఆర్‌ఎస్ నుంచి ఎంపీగా విజయం 2024లో బీజేపీ నుంచి లోక్‌సభ అభ్యర్థిగా గెలుపు

కొండంత గెలుపు

చేవెళ్లలో కమల వికాసం

- అసెంబ్లీకి భిన్నంగా లోక్‌సభ ఓటింగ్
- కొండాకు జై కొట్టిన మెజార్టీ ఓటర్లు
- మొదటి రౌండ్ నుంచీ అదే ఆధిక్యత
- రెండోసారి లోక్‌సభలో అడుగు పెట్టబోతున్న విశ్వేశ్వర్‌రెడ్డి
- ఓటమిని అంగీకరించి మధ్యలోనే వెనుదిరిగిన సిట్టింగ్ ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ స్థానంలో కమలం వికసించింది. అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా ఇక్కడి ఓటర్లు తీర్పు ఇచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్క చోట కూడా గెలవలేక పోయినప్పటికీ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికే ఓటర్లు జై కొట్టారు. అంచనాలకు భిన్నంగా మొదటి రౌండ్ నుంచి బీజేపీ తన ఆధిక్యత ప్రదర్శించింది. కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి ముందే ఓటమిని అంగీకరించారు. మధ్యాహ్నమే కౌంటింగ్ కేంద్రం నుంచి వెనుదిరిగారు. విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేశానని, మోదీ హవా ముందు తాను నిలబడలేక పోయానని, తన ఓటమికి తానే కారణమని ప్రకటించుకున్నారు. ఇదిలా ఉంటే 2014లో బీఆర్‌ఎస్ నుంచి ఇదే స్థానం నుంచి తొలిసారిగా ఎంపీగా గెలుపొంది, లోక్‌సభలో అడుగుపెట్టిన మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి.. ఆ తర్వాత 2019లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా 2024లో బీజేపీ నుంచి పోటీ చేసి భారీ విజయం సాధించారు. రెండోసారి ఆయన లోక్‌సభలో అడుగుపెట్టబోతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి బరిలో నిలిచిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మూడో స్థానంలో నిలిచారు.

ప్రశ్నార్థకంగా రంజిత్‌రెడ్డి భవితవ్యం

పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది. ఇదే సమయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ బీఆర్‌ఎస్ సిట్టింగ్ జెడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతారెడ్డి చేవెళ్ల లోక్‌సభ స్థానంపై దృష్టి సారించారు. సీఎం రేవంత్ రెడ్డి హామీ మేరకు వారు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. చేవెళ్ల నుంచి సునీతారెడ్డి పోటీ చేయడం ఖాయమనే సంకేతాలు పార్టీ కేడర్‌కు ఇచ్చారు. తీరా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత సంస్థాగతంగా అనూహ్య రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి ఆ పార్టీ మళ్లీ టికెట్ ఖరారు చేయగా ఆయన పోటీకి నిరాకరించి, కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటి వరకు ఈ సీటుపై గంపెడాశలు పెట్టుకున్న సునీతా మహేందర్ రెడ్డిని మల్కాజిగిరి నుంచి బరిలో నిలిపారు. రెండు చోట్ల ఇద్దరు అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. ఆశించిన దానికి భిన్నంగా ఓటర్లు తీర్పు ఇవ్వడంతో సిట్టింగ్ ఎంపీ రంజిత్ సహా జెడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి దంపతుల రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఎంపీ ఎన్నికల్లో ఓటమి పాలైన సునీతకు మళ్లీ జెడ్పీ పీఠం కట్టబెడతారా? ఒకవేళ ఇచ్చినా..ఆమె గెలుపొందుతారా? అనేది సందేహమే. ఇక స్థానికేతరుడిగా ముద్రపడిన రంజిత్‌రెడ్డి ఇకపై కూడా చేవెళ్లనే అంటిపెట్టుకుని ఉంటారా? లేక మరో స్థానాన్ని ఎంచుకుంటారా? వేచి చూడాల్సిందే.

ఓటింగ్ శాతం ఇలా..

చేవెళ్ల లోక్‌సభ స్థానంలో మొత్తం 43 మంది పోటీ పడ్డారు. 56.40 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా చేవెళ్లలో 71.83 శాతం నమోదు కాగా, 70.44 శాతం, తాండూరులో 67.33 శాతం, పరిగిలో 67.01 శాతం, రాజేంద్రనగర్‌లో 54.12 శాతం, మహేశ్వరంలో 52.71 శాతం, శేరిలింగంపల్లిలో అతి తక్కువగా 43.91 శాతం ఓటింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 165 టేబుళ్ల ఏర్పాటు చేశారు. అత్యధికంగా శేరిలింగంపల్లిలో 23 రౌండ్లు, చేవెళ్ల, పరిగి 22 రౌండ్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్ 20 రౌండ్ల చొప్పున ఓట్లను లెక్కించారు. వికారాబాద్ 21 రౌండ్లు, తాండూరు 20 రౌండ్ల చొప్పున లెక్కించారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు.



కలెక్టర్ శశాంక చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రౌండ్ల వారీగా..

రౌండ్	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్‌ఎస్
1	28,648	42,568	10,079
2	26,316	42,738	7,880
3	23,210	39,509	7,721
4	29,936	36,494	7,944
5	28,875	40,550	7,160
6	27,442	41,344	8,792
7	27,366	38,795	7,644
8	26,633	2,922	8,655
9	22,982	48,015	7,183
10	38,029	36,725	7,689
11	37,812	32,693	6,612
12	43,025	28,272	6,939
13	32,255	37,015	8,120
14	34,553	36,210	7,836
15	37,548	35,732	7,978
16	27,189	43,475	8,410
17	30,167	41,465	11,414
18	32,824	37,681	10,046
19	29,709	38,830	12,147
20	20,334	25,968	6,521
21	12,535	15,344	5,118
22	9,625	10806	3,932
23	3,372	5,011	1,600
24	476	354	120

మిశ్రమ ఫలితాలు

- లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌లో వికారాబాద్, కొడంగల్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యం
- తాండూరు, పరిగిలో బీజేపీకి జై కొట్టిన ఓటర్లు
- నోటాకు నాలుగో స్థానం

వికారాబాద్: జిల్లాలో గతంలో ఎప్పుడూ లేనంతగా బీజేపీ హవా కొనసాగింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ కమలం వికసించింది. ఓట్ల పరంగా చూస్తే గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే భారీగా అధికార కాంగ్రెస్‌కు గండి పడింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కంచుకోటలు కూడా బద్దలయ్యాయి. జిల్లాలో బీజేపీ పూర్తి ఆధిపత్యం కనబరిచింది. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో ఏ ఒక్క చోట కూడా అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు సాధించ లేకపోయారు. ఓవరాల్‌గా చూస్తే జిల్లాలో మిశ్ర మ ఫలితాలు వచ్చాయి. కొడంగల్, వికారాబాద్‌లో కాంగ్రెస్‌కు తాండూరు, పరిగి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి ఆధిక్యం వచ్చింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డికి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వచ్చిన మెజార్టీ కంటే ఓట్లు తగ్గినప్పటికీ కాంగ్రెస్‌కు ఆధిక్యం లభించడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇక పరిగి, తాండూరులలో గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్‌కు భారీగా ఓట్లు తగ్గటమే కాకుండా బీజేపీకి లీడ్ వచ్చింది. ఓవరాల్‌గా మొదటి రౌండ్ నుంచి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధిక్యంలో కొనసాగడంతో కాంగ్రెస్ అభ్యర్థి ఏ దశలోనూ కోలుకోలేక పోయారు.

నోటాకు నాలుగో స్థానం

ఈవీ ప్యాట్‌లలో మొత్తం 44 గుర్తులు ఉండగా నోటాకు నాలుగో స్థానం లభించింది. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తోపాటు మరో 40 మంది స్వతంత్ర అభ్యర్థులు చేవెళ్ల ఎంపీ స్థానం నుంచి పోటీ పడ్డారు. ఇందులో ఏ ఒక్కరూ నాలుగు వేల ఓట్ల మార్కును దాటలేకపోయారు. నోటా 6,308 ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరుతో ఉన్న మరో అభ్యర్థికి నాలుగో స్థానం వచ్చింది.



వికారాబాద్‌లో బీజేపీ నాయకుల సంబురాలు

నియోజకవర్గాల వారీగా పార్టీలకు వచ్చిన ఓట్లు.. (పోస్టల్ బ్యాలెట్ మినహా)

పార్టీ	వికారాబాద్	పరిగి	తాండూరు	కొడంగల్
బీజేపీ	67,408	73,788	77,555	62,560
కాంగ్రెస్	73,993	71,785	69,864	84,414
బీఆర్‌ఎస్	13,886	23,151	10,998	15,958
ఆధిక్యం	6,585 (కాంగ్రెస్)	2,003(బీజేపీ)	7,691(బీజేపీ)	21,854(కాంగ్రెస్)

అరుణకే పట్టం

మహబూబ్‌నగర్ ఎంపీగా విజయం



కొడంగల్: రాష్ట్రంలో అత్యంత ఉత్కంఠ కలిగించిన పాలమూరు పార్లమెంట్ స్థానంలో కమలం పార్టీ విజయం సాధించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఈ స్థానంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రతి రౌండ్‌లోనూ నువ్వా నేనా అన్నట్లు మెజారిటీ పెరుగుతూ.. తగ్గుతూ వచ్చింది. 21 రౌండ్లలో ఓట్లను లెక్కించారు. ఈవీఎం ఓట్లను లెక్కించగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిపై బీజేపీ అభ్యర్థి డీకే అరుణ 3,636 ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు. పోస్టల్ బ్యాలెట్ లోనూ డీకే అరుణకు 4వేలకు పైగా ఓట్లు వచ్చాయి. వాటిని లెక్కిస్తే సుమారు 7వేలకు పైగా మెజారిటీ వచ్చే అవకాశం ఉంది. కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి 84,414 ఓట్లు, బీజేపీకి 62,560 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 15,958 ఓట్లు వచ్చాయి. కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి 21,854 ఓట్ల మెజారిటీ వచ్చింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం పరిధిలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు నారాయణపేట, మక్తల్, దేవరకద్ర, మహబూబ్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్లలో మెజారిటీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి కొడంగల్, షాద్‌నగర్, జడ్చర్ల అసెంబ్లీ నియోజక వర్గాల్లో మెజారిటీ వచ్చింది. రేవంత్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో 33వేల మెజారిటీ వస్తే.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి 21,854 వేల మెజారిటీ వచ్చింది. నాటికి నేటికి సుమారు 12వేల ఓట్లు తగ్గాయి.

నైరాశ్యంలో కాంగ్రెస్ శ్రేణులు

పాలమూరు పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణులు నైరాశ్యంలో ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఈ స్థానంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గెలుపే లక్ష్యంగా పనిచేశారు. జిల్లాలో 6 సార్లు పర్యటించి పార్టీ క్యాడర్‌లో జోష్ నింపారు. గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేయించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని అహర్నిశలు కృషి చేశారు. అయితే ఎన్నికల ఫలితం మాత్రం ఆశించిన దానికి భిన్నంగా వచ్చింది. దీంతో పార్టీ క్యాడర్ నిరుత్సాహంగా ఉన్నారు. గెలిచే సీటు చేజారిపోయిందని ఆందోళన చెందుతున్నారు. రేవంత్ పోటీలో ఉన్నప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం కోసం కొడంగల్‌కు మూడు సార్లు వచ్చారు. ఎంపీ అభ్యర్థి కోసం మహబూబ్‌నగర్ జిల్లాలో 6 సార్లు పర్యటించారు. ఎంతో కష్టపడ్డారు. అయినా అపజయం తప్పలేదు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఫలితం కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా రాలేదు. బీఆర్‌ఎస్‌అభ్యర్థి గెలవడాన్ని పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. అధికారంలో ఉండి కూడా ఎమ్మెల్సీ స్థానంలో ఓడిపోవడం కాంగ్రెస్ వాదులకు నచ్చడం లేదు. ఎమ్మెల్సీ ఓటమి తర్వాత పార్లమెంట్ ఫలితాలు వచ్చాయి. పార్లమెంట్‌లో కూడా కాంగ్రెస్‌తో సమానంగా బీజేపీ సీట్లు సాధించుకుంది. పాలమూరులో డీకే అరుణ 4,500 ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు. కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీకి 84,414 ఓట్లు, బీజేపీకి 62,560 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 15,958 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి 21,854 ఓట్ల మెజారిటీ వచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌కు 33వేల మెజారిటీ వస్తే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి 21,854 వేల మెజారిటీ వచ్చింది.

ఓటమిని అంగీకరిస్తున్నా

చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



చేవెళ్ల: ఓటమిని అంగీకరిస్తున్నానని.. దీనికి పూర్తి బాధ్యత తనదేనని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలోని బండారు శ్రీనివాస్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం నుంచి మధ్యలోనే ఆయన బయటకు వచ్చారు. మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీకి ఊహించినదానికంటే ఎక్కువ మెజార్టీ వచ్చిందన్నారు. నిజంగా ఇంత వేవ్ ఉందని అనుకోలేదని.. పట్టణ ప్రాంతంలో ఎక్కువగా ప్రభావం చూపిందన్నారు. తన కోసం కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యేలు, నాయకులు శాయశక్తులా కష్టపడ్డారని అన్నారు. ఓటమిని అంగీకరిస్తూ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరినీ మన్నించమని అడుగుతున్నానన్నారు. విజయం సాధించిన విశ్వేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మారడం ఓటమికి కారణమా అని అడిగిన ప్రశ్నకు ఓటమికి ఎన్నో కారణాలు ఉన్నాయని అన్నారు.

న్యూస్‌రీల్

రైతులకు న్యాయం చేస్తాం

ఏడీఏ శంకర్ రాథోడ్



కొడంగల్: వరి విత్తనాలు వేసి సరైన దిగుబడి రాని రైతులకు న్యాయం చేస్తామని ఏడీఏ శంకర్ రాథోడ్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని ఓం ట్రేడింగ్ కంపెనీలో వరి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసిన రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సోమవారం కొడంగల్‌లో ధర్నా చేసిన రైతులు వారు కొనుగోలు చేసిన విత్తనాల రసీదు తోపాటు పాస్‌బుక్కు జిరాక్స్ కాపీలను అందజేయాలన్నారు. విత్తనాల విషయంలో విచారణ జరిపి సదరు కంపెనీపై చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాలు, గడువు తీరిన విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.

‘కొండా’కు అండగా పరిగి

పరిగి: లోక్‌సభ ఎన్నికల్లో పరిగి ప్రజలు కాషాయ జెండానే పట్టుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన వారు పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం కొండాకు అండగా నిలిచారు. దీనిపై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చలు సాగుతున్నాయి. మే 13న నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి రంజిత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి కాసాని జ్ఞానేశ్వర్ బరిలో నిలిచారు. నియోజకవర్గంలో మొత్తం 1,78,637 ఓట్లు పోలయ్యాయి. వీటిని 22 రౌండ్లలో లెక్కింగా 12 రౌండ్లలో బీజేపీ, పది రౌండ్లలో కాంగ్రెస్ ఆధిక్యం కనబర్చాయి. 74,034 ఓట్లు కమలం గుర్తుపై పడగా.. హస్తానికి 71,816 కారు గుర్తుకు 22,116 ఓట్లు పోలయ్యాయి. ఈ నియోజకవర్గం నుంచి బీజేపీ 2,218 ఓట్ల మెజార్టీ సాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి 24వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందగా.. బీజేపీ అభ్యర్థికి కేవలం 17వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. లోక్ సభలో 74,034 ఓట్లు రావడంతో కాషాయ దళంలో కొత్త జోష్ నిండింది.

తాండూరులో బీజేపీకి 7,790 ఓట్ల మెజార్టీ

తాండూరు: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్లో బీజేపీ మెజార్టీ ఓట్లను సాధించింది. రెండు దశాబ్దాల తర్వాత ఈ స్థాయిలో మెజార్టీ సాధించింది. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న సమయంలో తాండూరులో అప్పటి బీజేపీ అభ్యర్థికి మెజార్టీ రాగా.. 20 ఏళ్ల తర్వాత తాండూరు ఓటర్లు కమలాన్ని ఆదరించారు. నియోజకవర్గ పరిధిలోని బీజేపీ 77,654 ఓట్లు సాధించగా, కాంగ్రెస్ పార్టీకి 69,864 ఓట్లు, బీఆర్‌ఎస్ పార్టీకి 10,998 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా విశ్వేశ్వర్‌రెడ్డి 7,790 ఓట్ల మెజార్టీ అందించి ఆయన విజయానికి బాటలేశారు.

ఓట్ల లెక్కింపు ప్రశాంతం

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం ఆయన కార్వాన్, నాంపల్లి, యాకుత్‌పురా, చార్మినార్, చాంద్రాయణగుట్ట అసెంబ్లీసెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ ప్రక్రియకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి, పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల కమిషన్ నియమించిన కౌంటింగ్ అబ్జర్వర్స్ సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ ఈటల అధిక్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తంగా 18,880 ఉండగా, ఇందులో లక్ష 18,496 బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 10,330 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి 6,230 బ్యాలెట్ ఓట్లు, టీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 1,787 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ కంటే బీజేపీకి 4,100 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. నోటాకు 160 ఓట్లు రాగా, చెల్లని బ్యాలెట్ ఓట్లు 222 ఉన్నాయి. మిగతా ఓట్లు ఇతర అభ్యర్థులకు పోలైయ్యాయి.

స్పీకర్‌కు శుభాకాంక్షలు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపాలిటీ చైర్మన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్‌లు వికారాబాద్‌లోని గడ్డం ప్రసాద్‌కుమార్ నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భవిష్యత్తుల్లో మరిన్ని ఉన్నత పదవులు దక్కించుకుని ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల్లో కూలీ మృతి


లక్ష్మయ్య(ఫైల్)

దుద్యాల్: ఉపాధి హామీ పనులు చేస్తూ ఓ కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. దుద్యాల గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మయ్య(48) రోజు మాదిరిగానే ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో బీపీ డౌన్ అవ్వడంతో పనిచేస్తున్న చోటే పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య ఓ కూతురు, కుమారుడున్నాడు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి శిక్ష

జరిమానాతో పాటు రోగులకు పండ్లు పంపిణీ చేయాలని తీర్పు


డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులు

తాండూరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన పలువురికి తాండూరు కోర్టు జడ్జి మంగళవారం వినూత్న శిక్ష విధించారని పట్టణ సీఐ సంతోశ్‌కుమార్ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న మోయిజ్, ఎండి అఖిల్, సమీర్, సయ్యద్ జహీద్, శ్రీకాంత్, నరేశ్, ఫయాజ్ ఖాన్, మస్తాన్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వీరికి ఒక్కొక్కరికి రూ.200 జరిమానాతో పాటు రూ.500 పండ్లు కొనుగోలు చేసి రోగులకు పంపిణీ చేయాలని తీర్పునిచ్చారు. దీంతో వారు జిల్లా ఆస్పత్రిలో పలువురికి పండ్లు పంపిణీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీట్‌లో సత్తా చాటిన వైష్ణవి

1,629వ ర్యాంకు సాధించిన తాండూరు విద్యార్థిని


తల్లిదండ్రులతో వైష్ణవి

తాండూరు టౌన్: నీట్ ఫలితాల్లో తాండూరుకు చెందిన విద్యార్థిని 1,629వ ర్యాంకు సాధించింది. పట్టణంలోని గ్రీన్‌సిటీలో నివాసం ఉంటున్న శివకుమార్, అన్నపూర్ణ దంపతులు కుమార్తె వైష్ణవి మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో 720 మార్కులకు గాను 690 మార్కులు (99.7 శాతం) లతో ఓబీసీ కేటగిరీలో 1,629 ర్యాంకు సాధించింది. హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకున్న ఆమె ఇటీవల విడుదలైన ఎప్‌సెట్ ఫలితాల్లోనూ 413వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

శిథిలావస్థకు చేరిన నిర్మాణాల కూల్చివేత

అత్తాపూర్ : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లను కూల్చివేసినట్లు రాజేంద్రనగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ కె. రవికుమార్ తెలిపారు. ఇటీవల బాబుల్‌రెడ్డినగర్‌లో గోడకూలిన ఘటనలో చిన్నారులు మృతిచెందిన విషయం విషాదకరమన్నారు. శిథిలావస్థకు చేరిన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకుంటే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ.. జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.


లగచెర్లలో పంట పొలాల్లో పోసిన చెరువుమట్టి


పచ్చిరొట్ట ఎరువును కలియదున్నుతున్న రైతు

సేంద్రియ సాగుకే మొగ్గు

- రసాయన ఎరువులకు దూరంగా ఉండేందుకు రైతన్న యత్నం
- పొలాలకు పశుపేడ, కానుగ పొరక, చెరువు మట్టి తరలింపు
- పచ్చిరొట్ట సాగుచేస్తున్న అన్నదాతలు

దుద్యాల్: ఆధునిక వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం అధికమై రైతులు సాంప్రదాయంగా వాడిన సేంద్రియ ఎరువులను విస్మరిస్తున్నారు. సేంద్రియ ఎరువులు వాడకం వల్ల ఎరువులకు అయ్యే ఖర్చు తగ్గడమే కాకుండా భూసారం పెరిగి పంట మొక్కలు ఏపుగా పెరిగి పంటల దిగుబడులు పెరుగుతాయి. వాతావరణ కాలుష్య నివారణలకు తోడ్పడుతుంది. దీంతో రైతులు ప్రస్తుతం సేంద్రియ ఎరువులపై అధిక ఆసక్తి కనబరుస్తున్నారు. చెరువు ల్లో మట్టి పేరుకుపోయి సారవంతంగా మారుతుంది. సారవంతంగా మారిన ఒండ్రు మట్టిని పొ లాల్లో వేయడం వల్ల పంట దిగుబడి పెరుగుతుంది. అలాగే పశువుల పేడను, కానుగ పొరకను సేంద్రి య ఎరువులుగా వాడుతూ పొలాల్లో వేసుకుంటున్నారు. ఇవన్ని అందుబాటులో లేకుంటే పంటలకు పచ్చిరొట్టె ఎరువుగా జీలుగ, జనుములను పంట విత్తక ముందే పొలాల్లో సాగు చేసుకుంటున్నారు. ఏపుగా పెరిగిన తరువాత వాటిని భూమిలో కలియదున్నుతారు. అప్పుడు ఆ మొక్కలు భూమిలో కరిగిపోయి భూమి సారవంతంగా మారుతుంది. దీంతో ఆ పొలంలో పంటలు వేస్తే దిగుబడులు పెరుగుతాయిని రైతన్న తెలిపారు.

ఎరువుగా పచ్చిరొట్ట



పశువుల పేడ ఎరువుకు డిమాండ్ పెరిగి అధిక ధరలకు అమ్ముతున్నారు. దీంతో పెట్టుబడులు అధికమయ్యే అవకాశం ఉంది. మూడేళ్లుగా పంటకు ఎరువుగా పచ్చిరొట్ట సాగుచేస్తున్నాను. ఏపుగా పెరిగిన తరువాత భూమిలో కలిపి దున్నుతాం. ఇలా చేయడంతో రెండు పంటలకు ఎరువుగా నిల్వ ఉంటుంది. దీంతో పంటల దిగుబడులు పెరుగుతాయి.

– నర్సింలు, రైతు, ఆలేడ్

అభివృద్ధికి కట్టుబడి ఉంటాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

అనంతగిరి: దేశంలో ఎన్డీఏ కూటమి.. చేవెళ్ల ఎంపీగా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుతో ఆ పార్టీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా సంబురాలు నిర్వహించుకున్నారు. వికారాబాద్‌లోని ప్రధాన చౌరస్తాలో టపాసులు పేల్చి మిఠాయి పంచుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ విజయానికి కష్టించిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి బీజేపీ కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఎంపీగా గెలిచిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. దేశ ప్రజలంతా ప్రధానిగా మోదీనే ఉండాలని కోరుకుంటున్నారని మరో మారు రుజువైందన్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్య మని ప్రజలు గుర్తించారని పేర్కొన్నారు. భవి ష్యత్తులో కూడా అవినీతి రహిత పాలన అందిస్తారని పేర్కొన్నారు. పార్టీ విజయం కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలి పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శివరాజు, కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, వికారాబాద్ వైస్ ఎంపీపీ కొండి రాములు, సీనియ ర్ నాయకులు వడ్ల నందు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు యాస్కి శిరీష, మాజీ కౌ న్సిలర్ సుచరితారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, సతీశ్, బుచ్చిరెడ్డి, నందు పాల్గొన్నారు.


టపాసులు కాల్చుతున్న బీజేపీ శ్రేణులు

కూరగాయ వ్యర్థాలు మార్కెట్‌లోనే


మార్కెట్ యార్డు దుస్థితి



- దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు
- దోమలు, ఈగల స్వైర విహారం
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు

పరిగి: ఆదాయం ఎంత వచ్చినా అధికారులు, పాలకులు మాత్రం మార్కెట్ యార్డు పరిశుభ్రతపై పట్టు సాధించడం లేదు. అపరిశుభ్రంగా మారిన పరిగి మార్కెట్ యార్డు.. డంపింగ్ యార్డును తలపిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. మార్కెట్‌కు వచ్చే ప్రజలకు, వ్యాపారస్తులకు, రైతులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ శుక్ర, శనివారం సంత జరుగుతున్నా.. ఇక్కడ ప్రతీ రోజు కూరగాయలు లభిస్తాయి. మార్కెట్‌లో కూరగాయలు విక్రయానికి తెచ్చే రైతులు, వ్యాపారస్తులు కుళ్లిన కూరగాయలు అక్కడే పడేసి వెళ్తున్నారు. దీంతో యార్డు పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు అధికారులు, పాలకులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుళ్లిన కూరగాయలు అక్కడే వదిలేయడంతో దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. అధికారులు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని.. ఇప్పటికైనా స్పందించి యార్డు పరిసరాలను శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.

స్థానిక సంస్థల బలోపేతానికి కృషి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

షాద్‌నగర్: స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట శివారులో ఉన్న అంబభవానీ దేవాలయంలో నూతనంగా ఎన్నికైన మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలపై శాసన మండలిలో తన గళాన్ని వినిపిస్తానని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అండగా నిలిచి గెలుపునకు కృషి చేసిన వారందరికీ రుణపడి ఉంటానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీగా గెలిపించిన ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్సీని సన్మానించిన నాయకులు

దేవాలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిని స్థానిక నాయకులు పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బెంది శ్రీనివాస్‌రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, శివాచారి తదితరులు పాల్గొన్నారు.

విషాదం మిగిల్చిన విహారయాత్ర

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం, ఇద్దరికి గాయాలు


శబరీశ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపడానికి యాత్రకు వెళ్లారు. అనంతరం దైవ దర్శనానికి బయలు దేరారు. అంతలోనే అనుకోని ఉపద్రవం ఎదురైంది. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన ఓ కుటుంబం చేపట్టిన విహారయాత్ర విషాదాన్ని నింపింది. రోడ్డు ప్రమాదం రూపంలో బాలుడిని బలిగొన్న ఘటన స్థానికంగా కలచి వేస్తోంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్ల దర్శన్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మూడు కార్లల్లో విహారయాత్రకు వెళ్లారు. యాత్రలో భాగంగా భద్రాచలం నుంచి ములుగు జిల్లా మీదుగా తాడ్వాయి గుండా సమ్మక్క సారక్క వైపు వెళ్తుండగా మంగళవారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో తాళ్ల అరుణ్ కుమారుడు శబరీశ్(9) అక్కడిక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న అరుణ్, అతడి తండ్రి దర్శన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికంగా ప్రథమ చికిత్స అనంతరం ఇద్దరినీ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దర్శన్(60) పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తండ్రీతాతలు ఆస్పత్రిలో ఉండగా పిల్లాడి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు సిద్ధం చేశారు. దీంతో కొంగరకలాన్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుత్ స్తంభంపై మంటలు

మంచాల: గాలి దుమారం రావడంతో తీగలు ఆనుకొని విద్యుత్ స్తంభంపై ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. దీంతో స్థానికులు భయందోళనకు గురైన సంఘటన మండలంలోని జాపాల గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామంలోని ఆరో వార్డులో ఇళ్లను ఆనుకొని విద్యుత్ స్తంభాలున్నాయి. రాత్రి గాలి దుమారం రావడంతో విద్యుత్ తీగలు ఒకదానికొకటి ఆనుకున్నాయి. దీంతో మంటలు చెలరేగాయి. ప్రజలు చూస్తుండగానే మంటలు మరింతగా వ్యాప్తించాయి. వెంటనే విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ వారికి సమాచారం అందించడంతో వెంటనే వచ్చి పరిశీలించి సమస్యను పరిష్కారం చేశారు. ఇళ్లను ఆనుకొని స్తంభాలు ఉండడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని స్థానికులు వాపోతున్నారు.

తునికాకు బోనస్‌పై విచారణ

కుల్కచర్ల: తునికాకు సేకరణకు 2017లో కేంద్ర ప్రభుత్వం బోనస్‌గా ఇచ్చిన నిధులు పక్కదారి పట్టాయి అనే అంశంపై అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం మండల పరిధిలోని పుట్టపహాడ్, అనంతసాగర్ గ్రామాలకు చెందిన బీడీ ఆకు సేకరణ లబ్ధిదారులను పిలిపించి గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అటవీశాఖ జిల్లా అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ... బీడీ ఆకు సేకరణకు సంబంధించిన నగదు మీ ఖాతాల్లో జమ అయిందా.. ఎవరికైనా ఇచ్చారా అని ఆరా తీశారు. కాగా డబ్బు జమ చేశారని.. తమ అవసరాలకే వాడుకున్నామని వివరించారు. తాము కష్టం చేసినందుకు వచ్చిన డబ్బును వేరొకరికి ఇవ్వమన్నారు. ప్రస్తుతం ఇదే అంశం పై విచారిస్తున్నామని.. కొందరికే డబ్బు ఎందుకు జమచేశారని ఆరాతీస్తున్నామని అధికారులు వివరించారు. పుట్టపహాడ్‌కు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జమైందన్నారు. మరొక నలుగురికి రూ.5వేల చొప్పున జమ చేశారన్నారు. కొందరికే తునికాకు సేకరణ బోనస్ డబ్బులు జమ కావడం పట్ల విచారణ కొనసాగుతున్నది. స్థానిక అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.


పుట్టపహాడ్‌లో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

చిన్నారికి పెద్ద కష్టం

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఎనిమిది నెలల పసికందు
- ఆపరేషన్‌కు రూ.30 లక్షల ఖర్చు
- సహాయం కోసం అర్థిస్తున్న తల్లిదండ్రులు


చిన్నారి ఆరాధ్య

ఇబ్రహీంపట్నం రూరల్: తల్లి గర్భం నుంచే తన్నడం ప్రారంభించిన బిడ్డను కంటికి రెప్పలా అమ్మానాన్నలు కాపాడుకుంటారు. పిల్లలు ఎదిగే కొద్దీ ఉబ్బి తబ్బిబవుతారు. చిన్నారులకు ఏ చిన్న ఆపద కలిగినా విలవిలలాడుతారు. అలాంటిది ఓ చిన్నారి అరుదైన వ్యాధితో బాధపడుతుండటాన్ని ఆ తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. వైద్యం చేయించే స్థోమత లేని దంపతులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. తమ పాపను బతికించడానికి సాయం చేయాలని తెలిసినవారినల్లా ప్రార్థిస్తున్నారు. ఇదీ ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లిలో రాజశేఖర్ తేజశ్రీ దంపతుల పరిస్థితి. గ్రామానికి చెందిన రాజశేఖర్ తేజశ్రీలకు ఆరాధ్య అనే 8 నెలల కూతురు ఉంది. రాజశేఖర్ ఆటో నడిపి జీవనం సాగిస్తుంటా డు. వీరి కూతురు గత కొద్దిరోజు లుగా అనారోగ్యానికి గురయ్యింది. ఆస్పత్రులు తిప్పగా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని వైద్యులు సూచించారు. లేదంటే పాపకు జీవప్రక్రియ మందగించి క్రమంగా క్షీణిస్తుంది. వీలైనంతా త్వరగా ఆపరేషన్ చేస్తే పాప ప్రాణాలతో దక్కుతుందని వైద్యులు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స చేయలేమని చెప్పడంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించారు. ఆపరేషన్‌కు ఏకంగా రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో తల్లిదండ్రులు దిక్కుతోచనిస్థితిలో సాయానికి అర్థిస్తున్నారు. మానవతావాదులు స్పందించాలని కోరుతున్నారు. దాతలు సహకరిస్తే తప్పకుండా తమ బిడ్డ ప్రాణాలు కాపాడవచ్చని దంపతులు వేడుకుంటున్నారు. గూగుల్‌పే, ఫోన్‌పే నంబరు 95057 67104 అందుబాటులో ఉంటుందని తెలిపారు. పొన్నాల రాజశేఖర్ అకౌంట్ నంబరు 13891201000334, యూనియన్ బ్యాంక్ ఇబ్రహీంపట్నం బ్రాంచ్‌లో నగదు జమ చేయాలని కోరారు.

గుంతల దారి.. అవస్థలే మరి!

యాచారం: కంకర తేలి కాలినడకకు సైతం వీల్లేకుండా మారిన రోడ్డుతో స్థానికులు 20 ఏళ్లుగా సావాసం చేస్తున్నారు. రహదారికి మరమ్మతులు చేయాలని అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. గుంతల రోడ్డులో వెళ్లలేక ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇదీ మండలంలోని నస్దిక్‌సింగారం –అయ్యవారిగూడెం గ్రామాల మధ్యన ఉన్న రోడ్డు దుస్థితి. ఈ గ్రామాల మధ్య దాదాపు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉంది. 20 ఏళ్ల కిందట ఈ రోడ్డుకు మరమ్మతులు చేసి కంకర పోసి వదిలేశారు. నాటి నుంచి నేటి వరకు రహదారిపై గంప మట్టిని పోసిన దాఖలాలు లేవు. వర్షాలు కురిస్తే రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీళ్ల నిలవడంతో గ్రామస్తులు వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. అయినా అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో చలనం రాలేదు. ఎన్నికల సమయంలో రోడ్డుకు మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చిన నాయకులు గెలిచిన తర్వాత మొహం చాటేస్తున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని రెండు గ్రామాల ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

కౌంటింగ్‌కు మూడంచెల భద్రత

భోజన ఏర్పాట్లలో అధికారులు విఫలం


కౌంటింగ్ కేంద్రంలో భోజనానికి క్యూ కట్టిన పోలీసులు, ఏజెంట్లు, సిబ్బంది తదితరులు

చేవెళ్ల: సార్వత్రిక సమరంలో తుది ఘట్టమైన కౌంటింగ్‌కు ఎన్నికల కమిషన్ మూడంచెల భద్రతా ఏర్పాటు చేసింది. చేవెళ్లలోని బండారు శ్రీనివాస్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి మంగళవారం ఉదయం 6 గంటల నుంచే కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు చేరుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రౌండ్ల వారీ ఫలితాల్లో లేటుగా స్పందన

పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద వసతుల కల్పనలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు, పోలీసులు ఎంత మంది ఉన్నారో ముందే గుర్తించిన అధికారులు అందరికీ సరిపడా ఏర్పాట్లను మాత్రం చేయలేదు. ఉదయమే కౌంటింగ్ కేంద్రానికి వచ్చిన వారికి టిఫిన్ సరిగా ఇవ్వలేదు. అదే విధంగా మధ్యాహ్నం భోజనం కూడా సరిపడా పెట్టలేదు. భోజనం సమయంలో పోలీసులు, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు భారీగా క్యూ కట్టారు. భోజన సమయంలో అందరూ చాలా ఇబ్బందులకు గురయ్యారు. అదే విధంగా రౌండ్ల వారీగా ఎన్నికల ఫలితాలను మీడియా ప్రతినిధులకు తెలియజేయడంలోనూ అధికారులు అలసత్వం వహించారు.

బైకును తప్పించబోయి ఆర్టీసీ బస్సు బోల్తా

ఆసుపత్రికి తరలిస్తుండగా ద్విచక్రవాహనదారుడు మృతి

- క్షేమంగా బయటపడిన ఆర్టీసీ ప్రయాణికులు


బోల్తాపడిన ఆర్టీసీ బస్సు


మృతి చెందిన బైకిస్టు అంజయ్య

బంట్వారం: ఆర్టీసీ డ్రైవర్ ఓ బైక్‌ను తప్పించే క్రమంలో రోడ్డు పక్కన కల్వర్టుపై నుంచి కిందపడింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం కోట్‌పల్లి మండలం లింగంపల్లి చౌరస్తా సమీపంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. వికారాబాద్ డిపోకు చెందిన తొర్మామిడి ఆర్టీసీ బస్సు కోట్‌పల్లి నుంచి వికారాబాద్‌వైపు ప్రయాణిస్తోంది. ఇదే సయమంలో ధారూరు మండలం కుక్కింద గ్రామానికి చెందిన కె.అంజయ్య(45) ఒక్కసారిగా బస్సుకు ఎదురుగా వచ్చి టర్న్ తీసుకున్నాడు. అప్రమత్తమైన డ్రైవర్ జహంగీర్ బైక్‌ను తప్పించబోయి కల్వర్టును ఢీకొట్టడంతో బస్సు కల్వర్టు కింద పడిపోయింది. 50 మంది ప్రయాణికులున్నా అందరూ క్షేమంగా బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన అంజయ్యను తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బస్సు డ్రైవర్ జహంగీర్ స్వల్పంగా గాయపడ్డాడు. విషయం తెలసుకున్న స్రవంతి ఘటనా స్థలికి చేరకుని వివరాలు సేకరించారు. ఈ విషయమై వికారాబాద్ ఆర్టీసీ డీఎం భక్షినాయక్‌ను సంప్రదించగా బస్సులోని ప్రయాణికులందరు క్షేమంగా ఉన్నారని చెప్పారు. బస్సుకు ఎదురుగా వచ్చి సడన్‌గా యూటర్న్ తీసుకున్న బైకిస్టును తప్పించడంతోనే ప్రమాదం జరిగిందని చెప్పారు.